క్లుప్తంగా

హెచ్ఐవీపై అవగాహన

ఇంద్రవెల్లి: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కళాజాత బృందం ద్వారా హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్(హెచ్ఐవీ) వ్యాధి ఎలా వస్తుంది, నివారణ చర్యలపై పాటల ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు సీహెచ్ దామోదర్, శంకర్, విలాస్, రవి, నవ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: ఐటీ కళాశాలలో విద్యార్థుల చదువులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపడతామని కళాశాల ఐఎంసీ చైర్మన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం ఐఎంసీ కమిటీ సమావేశం నిర్వహించారు. లెక్చరర్లు లేరని ఇటీవల విద్యార్థులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కళాశాల ప్రిన్సిపాల్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వారి సమస్యలను పది రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ రొడ్డ శ్రీనివాస్, ఐఎంసీ కమిటీ సభ్యులు పద్మభూషణ్, రాజు, తిరుమల్ రెడ్డి, మహేశ్, అంజద్ ఖాన్ పాల్గొన్నారు.

1న డీసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

ఆదిలాబాద్‌టౌన్: డైట్ కళాశాలలో ప్రవేశం కోసం అక్టోబర్ 1న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టడం జరుగుతుందని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టులో నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డైట్ కళాశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హాజరు కావాలని కోరారు.

గురుకులంలో స్వచ్ఛత హీ సేవా

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో శనివారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛత హీ సేవా మండల కోఆర్డినేటర్ జాదవ్ చంపత్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఇంద్రవెల్లి: మండలంలోని మిలింద్‌నగర్‌లో దమ్మ చక్ర యూత్ కార్యవర్గాన్ని శనివారం బుద్ధ విహార్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. త్రిరత్న బుద్ధ విహార్ బంతేజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలో దమ్మ చక్ర యూత్ మండల అధ్యక్షుడిగా నవీన్ వాగ్మారే, ఉపాధ్యక్షుడిగా మస్కే అన్విత్, ప్రధాన కార్యదర్శిగా రుథిక్ కాంబ్లే, కార్యదర్శిగా అరవింద్ గోప్నే, కోశాధికారిగా శక్తి వాగ్మారేలను ఎన్నుకున్నారు.

పిడుగుపాటుకు ఆవులు మృతి

నేరడిగొండ: మండలంలోని రాజుర గ్రామంలో రై తులు జాదవ్ గణేశ్, ఆడె మంచకు చెందిన మూడు ఆవులు శనివారం సాయంత్రం పిడుగుపాటుకు మృతిచెందాయి. దాదాపు రూ.లక్ష వరకు విలువ చేసే ఆవులు మృతి చెందడంతో రైతులు కంటతడి పెట్టారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఇద్దరికి గాయాలు

ఇంద్రవెల్లి: గుర్తుతెలియని వాహనం ఢీకొని శనివారం సాయంత్రం అమరవీరుల స్థూపం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఇంద్రవెల్లి మండల కేంద్రానికి చెందిన దహిపోడే క్రాంతి ముత్నూర్ నుంచి ఇంద్రవెల్లి వైపు బైక్‌పై వెళ్తున్నారు. అదే క్రమంలో ఇంద్రవెల్లి నుంచి కేస్లాగూడకు బైక్‌పై వెళ్తున్న నవీన్‌లను గుర్తు తెలియని ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టి పారిపోయాడు. గాయపడిన వారిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో ఒకరికి గాయాలు

బేల: మండలంలోని ఎకోరి గ్రామానికి చెందిన మండల మిషన్ భగీరథ వర్కర్ విలాస్ శనివారం విద్యుత్ షాక్‌కు గురై గాయపడ్డాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పనులు చేస్తున్న క్రమంలో విద్యుత్ సరఫరా కావడంతో విద్యుత్ షాక్ గురయ్యాడు. గాయపడిన ఆయనను స్థానికులు జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నేరడిగొండ: జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీలను శుక్రవారం ఉట్నూర్ ఐటీడీఏ కుమురం భీం ప్రాంగణంలో నిర్వహించారు. పోటీల్లో నేరడిగొండ మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమోన్నత పాఠశాలల విద్యార్థినిలు ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు అంబారావు తెలిపారు. విద్యార్థినిలను శనివారం కుంటాల బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో సన్మానించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థినులను అభినందించారు.

భగత్‌సింగ్ త్యాగం మరువలేనిది

- వివిధ సంఘాల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు


ఆదిలాబాద్: భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: భారతదేశ స్వాతంత్య్రం కోసం భగత్ సింగ్ చేసిన త్యాగం మరువలేనిదని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ చౌక్‌లోని విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఆయన పోరాట పటిమను యువత అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు లాలా మున్నా, కౌన్సిలర్లు ఆకుల ప్రవీణ్, రఘుపతి, నాయకులు జోగు రవి, సోమ రవి, అర్జున్, అఖిల్, భారత్ పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని భగత్ సింగ్‌చౌక్‌లో భగత్‌సింగ్ విగ్రహానికి పూల మాలల వేసి నివాళులర్పించారు. సొనాలలో ప్రధాన కూడలి వద్ద ఏఐఎస్ఎఫ్ నాయకులు, సాకెర ప్రభుత్వ పాఠశాలలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో భీంఆర్మీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్ రావ్, భీం ఆర్మీ అధ్యక్షుడు పరత్యాగ్ సందీప్, ఉత్తం ,సోన్‌కాంబ్లే మనోహర్, కాంబ్లే అతీష్ పాల్గొన్నారు.


ఇంద్రవెల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు


ఎదులాపురం: నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: యువత మహనీయుల అడుగుజాడల్లో నడవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్ సమీపంలో గల భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు నిఖిల్, కార్తీక్, మహేశ్‌లు పాల్గొన్నారు.

ఎదులాపురం: భగత్‌సింగ్ జీవితం యువతకు స్ఫూర్తి దాయకమని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్ అన్నారు. సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం భగత్‌సింగ్ 117వ జయంతి నిర్వహించారు. భగత్‌సింగ్‌చౌక్‌లో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. పట్టణంలోని వాల్మీకి నగర్, ఇండస్ట్రియల్ ఏరియాలో శనివారం వాటర్ ట్యాంకుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆదిలాబాద్‌లో జనాభా రోజురోజుకూ పెరుగుతుందన్నారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణ ప్రజల దాహార్తి తీర్చాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకంలో భాగంగా నిధులు కేటాయించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్రజలందరికీ మంచినీటి సదుపాయం అందుబాటులోకి రానుందని తెలిపారు. వాల్మీకి నగర్‌లో 10 లక్షల లీటర్ల సామర్థ్యంతో ట్యాంకును నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు డ్రెయినేజీ వ్యవస్థను పునరుద్ధరించేలా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అహ్మద్, కౌన్సిలర్ ఉష్కం రఘుపతి, బీజేపీ నాయకులు మిష్మ, లాలామున్న, జోగు రవి, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే విజయం


మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్ సంకేత్ కుమార్

ఆదిలాబాద్‌టౌన్: కష్టపడి చదివితేనే విజయం సాధ్యమవుతుందని ఆలిండియా ఐఏఎస్ 35వ ర్యాంకర్, నిజామాబాద్ జిల్లా ట్రెయినీ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఏ ఉద్యోగమైనా కష్టపడి చదివితే సాధించవచ్చన్నారు. తాను కూడా సివిల్స్‌కు సిద్ధమయ్యే ముందు ఎందుకు సిద్ధం కావాలో అనే సెల్ఫ్ వీడియోను తీసుకున్నట్లు పేర్కొన్నారు. శ్రమించడంతోనే మంచి ర్యాంక్ వచ్చిందన్నారు. ఏ రంగంలోనైనా రాణించాలంటే వాటి గురించి తెలుసుకొని పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, వైస్ ప్రిన్సిపాల్ జగ్‌రాం, లెక్చరర్లు శ్రావణి, శ్రీధర, అరుణ్ కుమార్, సంతోష్ కుమార్, చక్రవర్తి, రవి, కిరణ్, అష్రఫ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సిబ్బంది

ఇంద్రవెల్లి: గురుకులం పాఠశాలలో ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరించాలని మండలంలోని ముత్నూర్ గురుకులం సిబ్బంది శనివారం చాక్ డౌన్.. పెన్ డౌన్‌లో భాగంగా నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. పాత టైమింగ్ ప్రకారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల టైమింగ్‌ను మార్చాలని, కొత్త టైమింగ్ ద్వారా విద్యార్థులకు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారన్నారు. పార్ట్ టైమ్ టీచర్లకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనలు ఇవ్వడంతో పాటు మెస్‌చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీప్రియ, వైస్ ప్రిన్సిపాల్‌లు సంగీత, విజయ, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల సమస్యలు పరిష్కరించాలి

ఇచ్చోడ: గురుకుల పాఠశాల, కళాశాల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ శనివారం గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో పెన్‌డౌన్ చాక్‌డౌన్ కార్యక్రమం ద్వారా నిరసన తెలిపారు. ట్రిటా జాయింట్ సెక్రెటరీ కృష్ణవేణి మాట్లాడుతూ.. గురుకులాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయలు కల్పించాలి, పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్‌చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. పార్ట్ టైం ఉపాధ్యాయులకు 12 నెలల వేతనంతో కూడిన మినీమం టైం స్కేల్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రోజరాణి, ఉపాధ్యాయులు అశ్విని, గీతాంజలి, స్వప్న పాల్గొన్నారు.

మహిళలకు అండగా షీటీం


అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

జైనథ్: యువతులు, మహిళలకు షీటీం అండగా ఉంటుందని షీటీం సభ్యులు సుశీల, సత్య మోహన్ అన్నారు. శనివారం మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థినులు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ చేయడం నేరామన్నారు. నిందితులపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామన్నారు. సైబర్ క్రైం నేరాల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తంగా ఉండాలన్నారు.

కార్గో సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్: ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ కార్గో మేనేజర్ బి. పాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్గో ద్వారా తెలంగాణ నుంచి ఇతర రాష్ట్రాలకు సైతం సేవలను విస్తరించినట్లు తెలిపారు. పార్సిళ్లు బుక్ చేసుకున్న వారికి మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తున్నామన్నారు.

సభ్యత్వ నమోదుకు స్పందన

బేల: బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ కూడలిలో ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు బోయర్ విజయ్, దత్తా నిక్కమ్, బోనిగిరివార్ గణేష్, ఇంద్రశేఖర్, ఠాక్రే సందీప్, పోత్రాజ్ నవీన్, బర్కాడే రాము, ధర్నే జీవన్ పాల్గొన్నారు.

ప్రశస్త్ యాప్‌పై అవగాహన

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రశస్త్ యాప్‌పై నిర్వహిస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. ఈనెల 26 నుంచి ఉపాధ్యాయులకు మాస్టర్ ట్రెయినర్లు శిక్షణ ఇస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన యాప్‌లో వైకల్యాం ఉన్న విద్యార్థుల వివరాల నమోదు, గుర్తింపుపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ఎంఈవో శ్యాంసుందర్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఐఈఆర్‌పీ సంజీవ్, సీఆర్పీ రవీందర్ పాల్గొన్నారు.

డయాలసిస్ చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారు వారానికి మూడుసార్లు డయాలసిస్ చేసుకోవాలని నిమ్స్ నెఫ్రాలజిస్టులు డాక్టర్ కార్తీక్, డాక్టర్ శశాంక్‌లు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో గల డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ అందుతున్న సేవలను డయాలసిస్ ఇన్‌చార్జి రాథోడ్ ప్రేమ్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎంత మంది వ్యాధిగ్రస్తులు ఉన్నారు, వారికి ఏవిధంగా సేవలు అందిస్తున్నారనే విషయాలపై ఆరా తీశారు. రక్త పరీక్షల రిపోర్టులు పరిశీలించారు. కిడ్నీ మార్పిడికి సంబంధించి జీవన్‌దాన్‌లో నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించారు. వారి వెంట రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, తదితరులు ఉన్నారు.

అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు


మాట్లాడుతున్న అదనపు డీఆర్‌డీవో కుటుంబరావు

ఇచ్చోడ: ఉపాధిహామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని అదనపు డీఆర్‌డీవో కుటుంబరావు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో 14వ జాతీయ ఉపాధిహామీ పథకం ప్రజావేదిక సామాజిక తనిఖీ నిర్వహించారు. రూ. 4 కోట్ల 48 లక్షల 5 వేల రుపాయల పనులు చేపట్టినట్లు తెలిపారు. తనిఖీలో గుర్తించిన లోపాలను బృందం సభ్యులు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో కృష్ణారావు, అంబుడ్స్ మెన్ వీణా, ఎంపీడీవో లక్ష్మణ్, రాంప్రసాద్, ఎస్టీఎం వేణుగోపాల్, ఎస్సీ ఆర్పీ తిరుపతి, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం

ఆదిలాబాద్‌టౌన్: విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్నామని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేందర్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని సంఘ భవనంలో పీడీఎస్‌యూ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ సభ నిర్వహించారు. 50 ఏళ్లలో సంఘం తరఫున చేసిన కార్యక్రమాలు, సాధించిన విజయాలు, పోరాటాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని విస్మరిస్తున్నాయని, విద్యార్థులు ఐక్యంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలన్నారు. స్కాలర్ షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు సిడాం సాయికుమార్, నంది రామయ్య, రాజన్న, ఆత్రం భుజంగ్‌రావు, వినోద్, అశోక్, నారాయణ, మనోజ్, జగన్ సింగ్ పాల్గొన్నారు.

నీటి సరఫరాపై మల్టీపర్పస్ కార్మికులకు శిక్షణ


శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: గ్రామ పంచాయతీల మల్టీపర్పస్ కార్మికులకు నీటి సరఫరాపై మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. మాస్టర్ ట్రెనర్ బషీర్ ఆధ్వర్యంలో ఈనెల 27న బోరుబావులు, బావుల్లోని విద్యుత్ మోటర్ వాడకంపై అవగాహన కల్పించగా.. శనివారం చేతి పంపుల మరమ్మతుల గురించి వివరించారు. 30న నీటి పరీక్షలు, అక్టోబర్ 1న ప్లంబ్లింగ్, పైప్‌లైన్ మరమ్మతులపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మిషన్ భగీరథ ఈఈ గోపిచంద్ తెలిపారు. నీటి సరఫరా విషయంలో సమస్యలు రాకుండా ఉండేందుకు గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భానుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ విజయవంతం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న అధికారులు

బోథ్: మండల కేంద్రంలోని బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం విజయవంతమైంది. బోథ్ కోర్టు పరిధిలో 172 కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కారమవగా.. బ్యాంకు అదాలత్ ద్వారా రూ. 46,84,000లు రికవరీ జరిగిందని జడ్జి బి. హంస్సేన్ తెలిపారు. కక్షి దారులకు సమయం ఆదా అవ్వడమే కాకుండా కేసులను తక్కువ సమయంలో పరిష్కారం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీపీ శ్రీధర్, ఏజీపీ పంద్రం శంకర్, న్యాయవాదులు అంగద్ రూపేందర్ సింగ్, ఆడెపు హరీష్ కుమ్మరి విజయ్, జమీర్ రాములు, దమ్మాపాల్, ఎస్సై ప్రవీణ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ఇంద్రవెల్లి: విద్యార్థినులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో మాస ఉమాదేవి అన్నారు. శనివారం మండలంలోని హీరపూర్ కస్తూరిబా గాంధీ వసతి గృహానికి సందర్శించి, మహిళ రక్షణ చట్టాలు, హెల్ప్‌లైన్ నెంబర్లపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. ఆహారంలో గుడ్లు, ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలన్నారు. మహిళలకు, యువతులకు ఎలాంటి సమస్య వచ్చిన వెంటనే హెల్ప్‌లైన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ టీచర్లు లక్ష్మి, వందన, సుభద్రత, అనిత, విద్యార్థినులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం

- లీజు స్థలాలు, నిధుల దుర్వినియోగంపై నిలదీత


మాట్లాడుతున్న చైర్మన్ జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని లీజ్‌స్థలాలు అన్యాక్రాంతమవుతుంటే న్యాయవాదులకు డబ్బులిచ్చి ప్రయోజనమేంటని కౌన్సిల్ సభ్యులు ప్రశ్నించారు. చైర్మన్ జోగు ప్రేమేందర్ అధ్యక్షతన శనివారం కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ప్యానెల్ లాయర్‌కు నిధులు చెల్లించాలని ఎజెండాలో పొందుపర్చడంపై కాంగ్రెస్ కౌన్సిలర్ బండారి సతీష్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయల విలువైన స్థలాలు కనుమరుగవుతుంటే లాయర్లకు లక్షలాది రూపాయలు ఫీజులు చెల్లించడంలో ప్రయోజనమేంటని ప్రశ్నించారు. మరో కౌన్సిలర్ జహీర్ రంజానీ మాట్లాడుతూ అభివృద్ధి పనులకు వెచ్చించాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను వృథాగా ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. వెనుగంటి ప్రకాష్ మాట్లాడుతూ తన వార్డులోని పార్కు స్థలానికి అధికారులు ఎలా డోర్ నెంబర్‌ను జారీ చేస్తారని ప్రశ్నించారు. కాగా చైర్మన్ మాట్లాడుతూ ఖానాపూర్ చెరువులో చేపట్టిన సర్వేతో బాధితులు ఆందోళన చెందుతున్నారని, వారికి ప్రత్యామ్నాయ పునారావసం కల్పించాకే సర్వే చేపట్టాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


సోలార్ ఫెన్సింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. బోథ్ ఎమ్మెల్యేగా పడిలేచి పదిహేను సంవత్సరాలకు కల సాకారం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినిలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో చదివి కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌లుగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు తుల శ్రీనివాస్, రాథోడ్ సజన్, నాయకులు తిరుమల్ గౌడ్, జహీర్, సాబ్లే నానక్ సింగ్, ప్రతాప్ సింగ్, దేవేందర్ రెడ్డి, రాథోడ్ సురేందర్, ప్రధానోపాధ్యాయులు అంబారావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

గోలి శంకర్ మృతి తీరని లోటు

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్ఎస్ నాయకుడు గోలి శంకర్ మృతి పార్టీకి తీరని లోటని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శనివారం మహాలక్ష్మివాడలోని నివాసంలో ఏర్పాటు చేసిన పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

సన్మానం

నార్నూర్: నూతన ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన పవార్ అనితను శనివారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం సాంబన్న గురుజీ, ఉమాజీ పాల్గొన్నారు.

అన్నదానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కోర్టు ఆవరణలో శనివా రం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొన్న కక్షిదారులకు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

సీఐని దూషించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువులో ఆక్రమణలకు సంబంధించిన విషయంలో వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్‌ను అసభ్య పదజాలంతో దూషించిన గూడారం గంగన్నతో పాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇసాఖ్ అలీ తెలిపారు.

ఎస్పీని కలిసిన ఇచ్చోడ ఎస్సై

ఆదిలాబాద్‌టౌన్: ఇచ్చోడ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన తిరుపతి జిల్లా ఎస్పీ గౌస్ ఆలంను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు.

బహుమతుల ప్రదానం

బోథ్: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకుని ఇటీవల నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు శనివారం భగత్ సింగ్ జయంతి సందర్భంగా బహుమతులు అందజేశారు. నాయకులు సుమేర్ పాషా, గోవర్ధన్, శ్రీకాంత్, షాకీర్, సిరిపురం దాస్, గోదావరి, నరేశ్, కార్తీక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫసల్ బీమా సమావేశంలో జిల్లా రైతు

తలమడుగు: ఫసల్ బీమా యోజన పథకం అములులో భాగంగా శనావారం హైదరాబాదులోని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా రైతు క్లెం కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఐటీడీఏ అధికారులు

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఐటీడీఏ అధికారులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలను అందజేసి సన్మానించారు.

సెల్‌ఫోన్లు అందజేత

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను శనివారం పోలీసులు బాధితులకు అందజేశారు. సిబ్బంది శ్రీనివాస్, హన్మంతులు ఫోన్‌లను కనుగొని సీఐ సునీల్ కుమార్ చేతుల మీదుగా అందించారు.

తుదిఓటరు జాబితాప్రదర్శన

ఇచ్చోడ: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో లక్ష్మణ్ తుది ఓటరు జాబి తాను ప్రదర్శించారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఓటరు జాబితాను పూర్తి చేసినట్లు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సిర్ర దేవేందర్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్న సానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ గార్డులు, ఇతర కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో గల సంఘ భవనంలో సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల ఏరియర్స్ విడుదల చేయాలన్నారు. సమావేశంలో నాయకులు చందు, ముజీబ్, డెవిల్, సైఫ్‌ఖాన్, గంగామణి, లస్మక్క, వెంకటేశ్, రమేశ్, ఇమ్రాన్‌ఖాన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.